తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 22- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 48 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# మోదీ నివాసం ముందు రాహుల్, ప్రియాంక ధర్నా

అరెస్టులతో ఢిల్లీలో రాజకీయ దుమారం

నీట్ అక్రమాలు, విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసన

రాహుల్, ప్రియాంక సహా ప్రతిపక్ష నేతల అరెస్టు.. అనంతరం విడుదల



**న్యూఢిల్లీ, జూలై 21(తెలంగాణ ముచ్చట్లు):**

నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జ్‌ను నిరసిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసం సమీపంలోని లోక్ కల్యాణ్ మార్గ్ వద్ద భారీ ఆందోళన చేపట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు మిత్రపక్షాలకు చెందిన పలువురు నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

మిగతా 2లో

## కేంద్రానికి కాంగ్రెస్ ఐదు ప్రధాన డిమాండ్లు

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ను నిరసిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మంగళవారం భారీ ఆందోళన చేపట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్వయంగా రాహుల్ గాంధీని కలిసి ఆందోళన విరమించాలని కోరారు. అనంతరం జరిగిన చర్చల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం ముందు ఐదు కీలక డిమాండ్లను ఉంచింది.

**కాంగ్రెస్ ఐదు ప్రధాన డిమాండ్లు**

1. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.
2. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో సమాధానం ఇవ్వాలి.
3. విద్యార్థుల సమస్యలు, వారి భవిష్యత్తుపై పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ నిర్వహించాలి.
4. నీట్ వ్యవహారంతో నష్టపోయిన బాధిత విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.
5. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలి.

## స్వల్పంగా గాయపడ్డ రాహుల్.. ముక్కు నుండి రక్తం

ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న సమయంలో జరిగిన తోపులాటలో రాహుల్ గాంధీ స్వల్పంగా గాయపడినట్లు సమాచారం. ఈ ఘటనలో ఆయన ముక్కు నుంచి రక్తస్రావం అయినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోల్లో కనిపించింది. అయితే గాయం తీవ్రతపై కాంగ్రెస్ లేదా పోలీసుల నుంచి అధికారిక వైద్య వివరాలు వెల్లడికాలేదు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకులు పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ, శాంతియుత నిరసనపై బలప్రయోగం చేశారని ఆరోపించారు.





# ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

## ప్రతి నెలా పురోగతిని స్వయంగా సమీక్షిస్తా

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వికారాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**

వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి ఎడ్యుకేషన్ హబ్‌లో నిర్మాణంలో ఉన్న ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కళాశాలలు, విద్యార్థి వసతి గృహాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే ఆ ప్రాంత అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

మిగతా 2లో




# ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తం..

- వర్షా భావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హనుమకొండ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మిగతా 2లో



# నీట్ లీక్‌పై మోదీ ఆగ్రహం

- పేపర్ లీక్‌ల నివారణ జాతీయ బాధ్యతన్న ప్రధాని
- పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయాలని పిలుపు
- యువత భవిష్యత్తుపై ఉమ్మడి బాధ్యతను గుర్తు చేసిన మోదీ

**న్యూఢిల్లీ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**

నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో బాధ్యులైన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టడం దేశానికి సంబంధించిన ఉమ్మడి బాధ్యత అని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన పరీక్షల వ్యవస్థను రూపొందించాలని పిలుపునిచ్చారు. ఈ విషయాలను ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేని పారదర్శకమైన, భద్రమైన వ్యవస్థను కేంద్రం, రాష్ట్రాలు, సంబంధిత సంస్థలు కలిసి నిర్మించాలని

మిగతా 2లో

# థర్మల్ ఉత్పత్తిపై భట్టి దృష్టి

- సింగరేణి గనుల్లో క్షేత్రస్థాయి పర్యటనకు సిద్ధమైన ఉప ముఖ్యమంత్రి
- నాణ్యమైన బొగ్గు సరఫరాతో విద్యుత్ ఉత్పత్తి పెంపే లక్ష్యం
- రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా చర్యలకు ఆదేశాలు

2లో



# చలో లోక్ భవన్ ఉద్రిక్తం..

## విద్యార్థి సంఘాల నేతల అరెస్టు

**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా, 'నీట్' అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధానను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన 'చలో లోక్ భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో విద్యార్థి సంఘాల నాయకులు ఖైరతాబాద్ సిగ్నల్ నుంచి లోక్ భవన్ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది.

లోక్ భవన్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పలువురు విద్యార్థి సంఘాల నేతలను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ పనులు నెమ్మదిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, ప్రతి ప్రాజెక్టు నెలవారీ పురోగతిని తప్పనిసరిగా నివేదించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రతి నెల ఒక రోజు నిర్మాణ ప్రాంతంలోనే బస చేసి పనులను పరిశీలిస్తానని చెప్పారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలసత్వం ప్రదర్శిస్తే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడవద్దని ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జరిగిన జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, వచ్చే వారంలోగా లబ్ధిదారులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన కిదాంబి శ్రీకాంత్‌కు సిఎం అభినందనలు

**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఇటీవల జరిగిన యూఎస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కిదాంబి శ్రీకాంత్‌కు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి, తెలంగాణకు గుర్తింపు తీసుకురావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో విజయాలు సాధించి దేశానికి మరిన్ని కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## థర్మల్ ఉత్పత్తిపై భట్టి దృష్టి

**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**



దేశవ్యాప్తంగా ఎల్‌నినో వాతావరణ ప్రభావం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా జెన్‌కో పరిధిలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాధించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ఇంధన శాఖ సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేశారు. జల విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నాణ్యమైన బొగ్గు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి బొగ్గు గనుల్లో తక్షణమే క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, రవాణా, సరఫరా వ్యవస్థపై ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహిస్తానని ప్రకటించారు. విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఉన్న ఆటంకాలను తొలగించి ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పనులు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే వేగం పుంజుకున్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంలో సరైన ప్రణాళిక లేకుండా వ్యవహరించడంతో అనేక సమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు. బొగ్గు సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ బొగ్గు పరిమాణం, నాణ్యత, సరఫరా విధానంపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల నేడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అవసరమైన పర్యావరణ అనుమతులు కూడా సకాలంలో సాధించలేకపోవడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన పర్యావరణ అనుమతులు సాధించి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. మొదటి 800 మెగావాట్ల యూనిట్‌ను విజయవంతంగా ప్రారంభించడంతో పాటు అనంతర కాలంలో మరో మూడు యూనిట్లను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. దీంతో 2026-27 నాటికి జెన్‌కో మొత్తం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,180 మెగావాట్లకు చేరిందని వివరించారు.

బొగ్గు సరఫరాలో ఇబ్బందులు ఉన్నప్పటికీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో జెన్‌కో 27,908 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి రాష్ట్ర మొత్తం విద్యుత్ అవసరాల్లో 31 శాతం మేర తీర్చగలిగిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. బొగ్గు సరఫరాను మరింత మెరుగుపరిస్తే రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో 40 శాతం వరకు జెన్‌కో ద్వారా తీర్చగల సామర్థ్యం ఉందని, సెప్టెంబర్ 2026లో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఐదో యూనిట్‌ను ప్రారంభించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు గనుల అభివృద్ధిపై తగిన చర్యలు తీసుకోకపోవడం, సింగరేణి సంస్థ బొగ్గు గనుల వేలాల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం వల్ల ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి విస్తరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని భట్టి విక్రమార్క ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన బొగ్గు అందుబాటులో ఉండేలా సమగ్ర కార్యాచరణ చేపడుతున్నామని, ఇందుకోసం సింగరేణి గనుల్లో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోదీ నివాసం ముందు రాహుల్, ప్రియాంక ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఢిల్లీ పోలీసులు రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కొందరిని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు, మరికొందరిని మోడల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాహుల్ గాంధీని పూచీకత్తుపై మోడల్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి విడుదల చేశారు.

**ప్రియాంక విడుదల.. కేంద్రంపై విమర్శలు**

మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ నుంచి ప్రియాంక గాంధీని కూడా విడుదల చేశారు. ఆమెతో పాటు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కూడా విడుదలయ్యారు.



విడుదల అనంతరం ప్రియాంక గాంధీ మాట్లాడుతూ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వారి సమస్యలు వినడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. విద్యార్థులపై పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జ్ చేశారని, పలువురు తీవ్రంగా గాయపడ్డారని ఆరోపించారు. అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ అంశాన్ని పార్లమెంట్‌లో తప్పకుండా ప్రస్తావిస్తామని, విద్యార్థుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని అన్నారు.

**సోనియా గాంధీ పరామర్శ**

మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పరామర్శించారు. ఢిల్లీ పోలీసుల చర్యలను కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. రాజధానిలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. విద్యార్థులపై బలప్రయోగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ ఆరోపిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

# ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తం..

(మొదటి పేజీ తరువాయి)




హనుమకొండ కలెక్టరేట్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, వర్షాభావ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు వెల్లడించారు.

వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించి తగిన సహాయం కోరనున్నట్లు తెలిపారు. రైతులు వరి, పత్తికి బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కోతుల బెడద నివారణ చర్యలపై కూడా రైతులకు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, లోపాలు తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందని స్పష్టం చేశారు.

మంత్రి ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు.

### ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో జూలై 27 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్నిచ్చే పంటలను ప్రోత్సహించాలని సూచించారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించుకుంటే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా అధిగమించవచ్చని మంత్రి పేర్కొన్నారు. -మంత్రి పొన్నం ప్రభాకర్


# నీట్ లీక్‌పై మోదీ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని సూచించినట్లు రిజిజు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, దేశ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి చర్య తీసుకుంటామని ప్రధాని పేర్కొన్నట్లు వెల్లడించారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ విషయం వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని ప్రధాని గుర్తు చేశారు. కేసులో నిందితులను అరెస్టు చేయడంతో పాటు విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తిరిగి పరీక్ష నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారని రిజిజు తెలిపారు. దోషులను చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తామని ప్రధాని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ప్రభుత్వానికి సంఘీభావంగా ఉండాలని ప్రధాని కోరినట్లు సమాచారం. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలకు సహకరించాలని సూచించారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమైన అంశమని, దీనిపై అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై విద్యార్థుల నిరసనలు ఢిల్లీలో కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రి జేపీ నడ్డా నిరసనకారుల ప్రతినిధులతో సమావేశమై వారి డిమాండ్లను స్వీకరించినట్లు సమాచారం. నీట్ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన



వేళ ప్రధాని చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీపడే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని ప్రధాని స్పష్టం చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# చలో లోక్ భవన్ ఉద్రిక్తం..

(మొదటి పేజీ తరువాయి)

'నీట్' పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కూడా వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి.

**విద్యార్థుల అరెస్టులను ఖండించిన విద్యార్థి సంఘాలు**

'చలో లోక్ భవన్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని వివిధ విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. విద్యార్థి నాయకులను, విద్యార్థులను ఈడ్చుకుంటూ పోలీసు వాహనాల్లోకి ఎక్కించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నాయి.

పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు తెలిపాయి. సోనం వాంగ్చుక్‌తో పాటు దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య హక్కులు, విద్యా హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులు, యువతకు తమ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు వెల్లడించాయి.

**ధర్మేంద్ర ప్రధానను బర్తరఫ్ చేయాలని డిమాండ్**

'నీట్' పేపర్ లీక్‌తో పాటు విద్యారంగంలో చోటుచేసుకున్న వివిధ సమస్యలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధానను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరారు.





విద్యను పరిరక్షించాలని, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై ఇలాంటి నిర్బంధ చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, అరెస్టు చేసిన విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## భీమదేవరపల్లి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా దొంగల రాణాప్రతాప్ నియామకం



**భీమదేవరపల్లి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ జనతా పార్టీ భీమదేవరపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా దొంగల రాణాప్రతాప్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
తమ కుటుంబానికి భారతీయ జనతా పార్టీతో దశాబ్దాల అనుబంధం ఉందని రాణాప్రతాప్ పేర్కొన్నారు. తన తాత దొంగల వెంకట్రాజం జనసంఘ్ కాలం నుంచే జాతీయ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశారని, అనంతరం తన తండ్రి దొంగల కొమురయ్య కూడా బీజేపీలో నిబద్ధతతో పనిచేస్తూ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందించారని తెలిపారు.
తనను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించిన మండల అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షులు, బైరీ శంకర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఖమ్మం వెంకటేశం, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి, పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్, మాచర్ల కుమార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ భీమదేవరపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని రాణాప్రతాప్ తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## యాత్ర విషాద బాధితులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి అండ

- **మృతదేహం తరలింపు, క్షతగాత్రుల చికిత్సకు రూ.1.15 లక్షల సాయం**



**వనపర్తి,జూలై21(తెలంగాణ ముచ్చట్లు):**తమిళనాడులో ఆధ్యాత్మిక యాత్ర సందర్భంగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి పట్టణానికి చెందిన చీర్ల శ్యామ్ సాగర్ (స్వామి) మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. విషయం తెలుసుకున్న వెంటనే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు.ప్రమాదంలో గాయపడిన బాధితులను స్వస్థలానికి తరలించేందుకు, మృతదేహాన్ని వనపర్తికి తీసుకురావడానికి, క్షతగాత్రుల చికిత్సతో పాటు ఇతర అత్యవసర ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే మొత్తం రూ.1.15 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, తీవ్ర విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయ సహకారాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులోనూ అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం అందించడంపై బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సహకార సంఘాలు రైతుల సొంతం.. రాజకీయ నేతల అడ్డాగా మార్చొద్దు



- **ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్ రావు**

**ఎల్కతుర్తి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల సొంత సంస్థలని, వాటిని రాజకీయ నేతల అడ్డాగా మార్చే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు హింగే భాస్కర్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నిర్వహణలో రైతుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాజకీయ జోక్యాన్ని పెంచడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధి, పంట రుణాలు, ఎరువులు, విత్తనాల పంపిణీ, ధాన్యం కొనుగోలు వంటి కీలక సేవలను అందించే సహకార సంఘాలు రైతుల సంక్షేమం కోసం పని చేయాల్సి ఉండగా, వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. సహకార సంఘాల పాలక వర్గాలను రైతులే స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం, నామినేటెడ్ పదవుల ద్వారా రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చాలని చూడడం ఖండనీయమని హింగే భాస్కర్ రావు అన్నారు. రైతుల సంక్షేమాన్ని పక్కనబెట్టి రాజకీయ నిరుద్యోగులకు పదవులు కట్టబెట్టే ధోరణిని వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
సహకార సంఘాలు రాజకీయాల కోసం కాకుండా రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని, వాటి స్వయం ప్రతిపత్తిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను గౌరవిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి, సహకార సంఘాల పాలన రైతుల చేతుల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల హక్కులకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తెలంగాణ రైతు రక్షణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని హింగే భాస్కర్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, నాయకులు కొదరే మాధవ రావు, సుధాకర్ రావు, శ్రీనివాస్, భాష, పోయిన కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట.. సత్తుపల్లి సింగరేణిలో 10 వేల మొక్కలు..





- **జేవీఆర్ ఓసీలో భారీ వృక్షారోపణ కార్యక్రమం.**
- **హరితాభివృద్ధికి సింగరేణి కట్టుబడి ఉంది.**
- **జీఎం చింతల శ్రీనివాస్.**

**సత్తుపల్లి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ సింగరేణి సత్తుపల్లి ఏరియా ఆధ్వర్యంలో మంగళవారం భారీ స్థాయిలో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) ఆదేశాలు, సింగరేణి యాజమాన్య సూచనల మేరకు జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ (జేవీఆర్ ఓసీ) ప్రాజెక్టు పార్కింగ్ యార్డులో చేపట్టిన 'మాస్ ప్లాంటేషన్ డ్రైవ్'లో ఏరియా వ్యాప్తంగా 10 వేల మొక్కలను నాటారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, హరిత విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా, ప్రాజెక్టు అధికారులు, ఫారెస్ట్రీ, పర్యావరణ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్. సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ డి. రమేష్‌బాబు తదితర కార్మిక సంఘాల నాయకులు మొక్కలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో యాజమాన్యానికి ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని వారు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, సత్తుపల్లి ఏరియాను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

## నూతన బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు అలవర్చుకోవాలి

- **మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ**



**ఎల్కతుర్తి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులను అలవర్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ అన్నారు.
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు మొదటి విడత మూడు రోజుల ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) రెమిడియేషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్క్‌బుక్స్ ఆధారిత బోధన, ఆటల ద్వారా అభ్యాసం, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత బోధన, సమగ్ర మూల్యాంకనం వంటి అంశాలపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నూతన విద్యా విధానానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో వినియోగించుకోవాలని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని చదువుల సత్యనారాయణ సూచించారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా శ్రీనివాస్, హర్షవర్ధన్ రెడ్డి, వంశీకృష్ణ, విజయ, సీఆర్పీ రవికుమార్ పాల్గొని శిక్షణ అందించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదో తరగతిలో మండల టాపర్ దీప్తిని సన్మానించిన జిల్లా కలెక్టర్



**వనపర్తి,జూలై21(తెలంగాణ ముచ్చట్లు):** పదో తరగతి వార్షిక పరీక్షల్లో తెలుగు మాధ్యమ విభాగంలో పెద్దమందడి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని దీప్తిని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సన్మానించారు.వనపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేసి ఆమెను అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత విజయాలను అందుకోవచ్చని అన్నారు.దీప్తి సాధించిన మండల ప్రథమ స్థానం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు విద్యార్థినిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, వార్డు సభ్యులు, విఐపీ సంస్థ భాగస్వామ్య సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీలో భక్తి శ్రద్ధలతో సీతలా పండుగ

**హనుమకొండ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండలోని ఇందిరమ్మ కాలనీ వాసులు సీతలా పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డీసీసీ ఎస్టీ సెల్ వరంగల్ జిల్లా చైర్మన్ గుగులోత్ రవీందర్ నాయక్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా కాలనీ వాసులు గుగులోత్ రవీందర్ నాయక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, తమ కుల సంప్రదాయాలు, ఆచారాలను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవడంతో పాటు భావి తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. అలాగే సత్‌గురు శ్రీ సేవలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి కాలనీ వాసులందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు ధరవత్ మోహన్, భూక్యా వినోద్ కుమార్, గుగులోత్ రమేష్, పూజారి ధరవత్ భద్రు నాయక్, ఇస్లావత్ ఈరు, మాలోత్ వెంకటేష్, ఇస్లావత్ కృష్ణ, మైళ్లలు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలు నాటి భావితరాలకు పచ్చని భవిష్యత్ అందిద్దాం


**సర్పంచ్ గజ్జల సృజన రమేష్**



**భీమదేవరపల్లి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వంగర గ్రామంలో గ్రామ ప్రజలకు వివిధ రకాల మొక్కలను గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జల సృజన రమేష్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం వల్ల వాతావరణ సమతుల్యత కాపాడబడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందుతుందని తెలిపారు.
గ్రామాన్ని మరింత పచ్చదనంతో నింపేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిరంతరం హరిత కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలందరూ మొక్కలు నాటి వాటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలు పాల్గొని మొక్కలను స్వీకరించారు. వాటిని సంరక్షించి పెంచుతామని హామీ ఇచ్చారు. "ఒక్క ఇంటికి ఒక మొక్క...పచ్చని గ్రామం - ఆరోగ్యకరమైన భవిష్యత్తు" అనే నినాదంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఒకే దేశం.. ఒకే ఓటు లక్ష్యానికి సహకరించాలి



- **పురుషోత్తం రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు**

**పెద్దమందడి, జూలై 21(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ప్రతి పౌరుడు సహకరించాలని, ఒకే దేశం.. ఒకే ఓటు లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే భారత ఎన్నికల వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడంతో పాటు ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు లేకుండా చేయడమే ఎన్నికల సంఘం లక్ష్యమని అన్నారు.అందుకోసం ప్రతి అర్హ ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. ఫారాలు సమర్పించని పక్షంలో ఓటు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, ఒక్కరికి ఒకే ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సుక్క మధు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గొడుగు నరేందర్, సీనియర్ నాయకుడు డి. విట్టల్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు మార్చరాజు, పెద్ది రామకృష్ణ, జి. పవన్ కుమార్, కే. రాముడు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొత్త రాజోలి వద్దు.. పాత రాజోలిలోనే ఎమ్మార్వో భవనం నిర్మించాలి



- **గ్రామస్తుల డిమాండ్**

**జోగులాంబ గద్వాల, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** రాజోలి మండల కేంద్రంలో నూతన ఎమ్మార్వో కార్యాలయ భవనాన్ని కొత్త రాజోలిలో కాకుండా పాత రాజోలిలోనే నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజకీయ పార్టీలకు అతీతంగా యువకులు, గ్రామ పెద్దలు తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు.తెలంగాణ ప్రభుత్వం రాజోలి మండల కేంద్రంలో నూతన ఎమ్మార్వో కార్యాలయ భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో వరదల కారణంగా ప్రభావితమైన మండల కేంద్రం రాజోలిలోనే నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల పరిధిలోని 11 గ్రామాల ప్రజల అభిప్రాయాలను తీర్మానం రూపంలో సేకరించి త్వరలో జిల్లా కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలందరికీ సౌకర్యంగా ఉండేలా ఎమ్మార్వో కార్యాలయాన్ని పాత రాజోలిలోనే ఏర్పాటు చేయాలని, వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అదే అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, పచ్చర్ల మాజీ ఎంపీటీసీ పరమేష్ నాయుడు, వివిధ గ్రామాల ప్రజలు, రాజోలి గ్రామ యువకులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్‌నినో కమిటీ ఛైర్మన్‌గా నియామకం.. డా. జి. చిన్నారెడ్డికి ఘన సన్మానం



**వనపర్తి, జూలై21(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌నినో కమిటీ ఛైర్మన్‌గా డా. జి. చిన్నారెడ్డిని నియమించిన సందర్భంగా వనపర్తి జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షుడు గంజాయి రమేష్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గంజాయి రమేష్ మాట్లాడుతూ, డా. జి. చిన్నారెడ్డికి ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యత ఎంతో కీలకమైనదని అన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన, పరిపాలనా అనుభవంతో ఆయన కమిటీ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించి ప్రజలకు మరింత చేరువవుతారని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా మాజీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎం. దేవన్న యాదవ్, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మున్నూరు జయకర్, అజీమ్, వీరయ్యపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదో వార్డులో మిషన్ భగీరథ పైపులైన్ విస్తరణకు వినతి




**జమ్మికుంట టౌన్ జులై 21 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని ఐదో వార్డులో మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ అందని ఇళ్లకు వెంటనే పైపులైన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ వార్డు ప్రజలు మంగళవారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్‌కు వినతిపత్రం సమర్పించారు.

మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వార్డు ప్రజలు, తమ ప్రాంతంలోని పలు గృహాలకు ఇప్పటికీ మిషన్ భగీరథ పైపులైన్ వేయకపోవడంతో తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని వివరించారు. సంబంధిత ఇళ్లకు పైపులైన్ వేయించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వినతిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణ పరిధిలోని మిర్జీడు, కొత్తపల్లి ప్రాంతాలకు అమృత్ పథకం ద్వారా తాగునీటి సరఫరా కోసం కొత్త పైపులైన్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే క్రమంలో ఐదో వార్డులో పైపులైన్ లేని గృహాలకు కూడా మిషన్ భగీరథ తాగునీటి సౌకర్యం అందేలా సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి హామీ ఇవ్వడంపై వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యాట్ల అవినాష్, రమేష్, కాళోజీ లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

# గోశాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కోరిన మహిళా కాంగ్రెస్




**జమ్మికుంట టౌన్ జులై (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో నిరాశ్రయ గోమాతల సంరక్షణకు శాశ్వత పరిష్కారం కల్పించేలా గోశాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ జమ్మికుంట తహసీల్దార్ (ఎంఆర్వో)కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పట్టణంలో సంచరిస్తున్న నిరాశ్రయ పశువుల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అదే సమయంలో గోమాతల సంరక్షణ కూడా అత్యవసరంగా మారిందని వివరించారు. గోశాల ఏర్పాటు ద్వారా గోమాతలకు రక్షణ కల్పించడంతో పాటు పట్టణంలో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు.

వినతిని స్వీకరించిన తహసీల్దార్ సమస్య ప్రాముఖ్యతను శ్రద్ధగా ఆలకించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశీలించి గోశాల ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయింపుపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ప్రజా సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో స్పందించిన తహసీల్దార్‌కు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. జమ్మికుంటలో త్వరలోనే గోశాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం మంజూరై గోమాతల సంరక్షణకు శాశ్వత పరిష్కారం లభించాలని ఆకాంక్షించారు.

# ప్రజా భద్రతే మా లక్ష్యం






- **కరీంనగర్ సీపీ గౌష్ ఆలం**




**జమ్మికుంట టౌన్ జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ, రోడ్డు భద్రత, నాణ్యమైన పోలీసింగ్ లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం ఇల్లందకుంట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ప్రారంభోత్సవం, వనమహోత్సవంలో మొక్కల నాటడం, విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ, పోలీస్ స్టేషన్‌లు మరియు సర్కిల్ కార్యాలయాల వార్షిక తనిఖీలు నిర్వహించారు. మొదట ఇల్లందకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించిన సీపీ, గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, నేరాల దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించాలని సూచించారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. నేడు నాటే మొక్కలే రేపటి తరాలకు జీవనాధారమని విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో అత్యవసర పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు ముద్రించిన ఎగ్జామ్ ప్యాడ్లను పంపిణీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇస్తూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను అందజేసిన సీపీ, హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని పేర్కొన్నారు.

ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, పోలీస్-ప్రజల సమన్వయంతోనే నేరాలను సమర్థంగా అరికట్టవచ్చని అన్నారు. గ్రామాల్లో మాదకద్రవ్యాల విక్రయం, జూదం, సైబర్ మోసాలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పర్యటనలో భాగంగా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించి కిట్ ఇన్‌స్పెక్షన్, పెండింగ్ కేసులు, రికార్డులు, ప్రభుత్వ ఆస్తులు, క్రైమ్ ప్రాపర్టీ, దర్యాప్తు పురోగతి తదితర అంశాలను సమీక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచడంతో పాటు నాణ్యమైన దర్యాప్తుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.అలాగే ప్రతిపాదిత ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, ఆధునిక సౌకర్యాలతో కూడిన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జమ్మికుంట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, కార్యాలయ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ ఫైళ్లు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, హుజూరాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఇల్లందకుంట ఎస్సై ఎం. క్రాంతికుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్టుకు శ్రీకారం



**పెద్దమందడి, జూలై21(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామంలోని శ్రీశ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం జమ్మి చెట్టుకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ పలుసు శ్రీనివాస్ గౌడ్, దేవాదాయ కమిటీ అధ్యక్షుడు పోతుల రాంరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా గ్రామస్తులు జమ్మి పూజ నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్టును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజారి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జమ్మి మొక్కను నాటారు. ఈ కార్యక్రమం గ్రామ సంప్రదాయాలను పరిరక్షించే దిశగా ఉపయోగపడుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుసు శ్రీనివాస్ గౌడ్, దేవాదాయ కమిటీ అధ్యక్షుడు పోతుల రాంరెడ్డి, గ్రామ పెద్దలు ఎస్. రాములు, గొంది రామకృష్ణారెడ్డి, ఎం. బుచ్చన్న, వడ్డె చంద్రయ్య, పోతుల ప్రతాప్, బోయిన్ కృష్ణయ్య, జి. బాలరాజు, గుర్రంగడ్డ చల్మారెడ్డి, మందడి బందన్న, రాములు యాదవ్, పోతుల ప్రవీణ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం - 22 - జూలై 2026




# భువనగిరి మహాసభను విజయవంతం చేయాలి

- **బానోత్ సునీల్ నాయక్**

**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**హైదరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నారగని ప్రీతంను తెలంగాణ భూరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైశయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దుబ్బెట రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సునీల్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూలై 24న భువనగిరిలోని ఎస్‌వీ ఆడిటోరియంలో నిర్వహించనున్న తెలంగాణ భూరక్షణ సమితి తొలి మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా బానోత్ సునీల్ నాయక్ మాట్లాడుతూ, భువనగిరిలో జరిగే తొలి మహాసభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం మరోసారి పరిశీలించి, భూములు కోల్పోయిన అర్హులకు తిరిగి అప్పగించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.జూలై 24న జరిగే సభకు ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నారగని ప్రీతం హాజరుకానున్నారని తెలిపారు. భూములు కోల్పోయిన బాధితులంతా పెద్ద ఎత్తున సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో సంపత్, రవి, వెంకటేష్, భువనగిరి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.



భువనగిరి మహాసభను విజయవంతం చేయాలి

- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**పెద్దమందడి,జూలై21తెలంగాణ ముచ్చట్లు):** ఓటు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, దానిని పరిరక్షించడంలో బీఎల్ఏలు చురుగ్గా వ్యవహరించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి, గట్లఖానాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రతి అర్హ ఓటరును ప్రత్యక్షంగా కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా చైతన్యం కల్పించడం బీఎల్ఏల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, మాధవ రెడ్డి, రవిప్రకాశ్ రెడ్డి, డేగ మహేశ్వర్ రెడ్డి, నరేష్, చిట్యాల రాము, జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రవీందర్ రావు, లక్ష్మణ్ గౌడ్, శంకర్ నాయక్, రమేష్‌హనుమంతు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏలు చురుగ్గా వ్యవహరించాలి

- **మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

**పెద్దమందడి,జూలై21తెలంగాణ ముచ్చట్లు):** ఓటు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన హక్కు అని, దానిని పరిరక్షించడంలో బీఎల్ఏలు చురుగ్గా వ్యవహరించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి, గట్లఖానాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రతి అర్హ ఓటరును ప్రత్యక్షంగా కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు అయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించేలా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా చైతన్యం కల్పించడం బీఎల్ఏల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, మాధవ రెడ్డి, రవిప్రకాశ్ రెడ్డి, డేగ మహేశ్వర్ రెడ్డి, నరేష్, చిట్యాల రాము, జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, రవీందర్ రావు, లక్ష్మణ్ గౌడ్, శంకర్ నాయక్, రమేష్‌హనుమంతు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ పండుగకు ప్రభుత్వ సెలవు ప్రకటించాలి

- **ఆగస్టు 18 నుంచి 27 వరకు ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలి**
- **గోర్ సేన,గోర్ సిక్వాడి డిమాండ్**




**హనుమకొండ, జూలై21(తెలంగాణ ముచ్చట్లు):** గోర్ సిక్వాడి, గోర్ సేన భారత్, తెలంగాణ కమిటీల పిలుపు మేరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా గోర్ సేన ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా గోర్ సేన అధ్యక్షుడు మాలోతు చిట్టిబాబు నాయక్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బంజారా సమాజానికి చెందిన ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం తీజ్ పండుగను తండాలు, గ్రామాలు, పట్టణాల్లో ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. తీజ్ పండుగ రోజున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గోర్ సిక్వాడి మీడియా విభాగం అధ్యక్షుడు బాదావత్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆగస్టు 18 నుంచి 27 వరకు పది రోజులపాటు తీజ్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తీజ్ పండుగ సింధు నాగరికతకు పూర్వం నుంచే బంజారా సమాజ వారసత్వ సంపదగా కొనసాగుతోందని పేర్కొన్నారు.తొమ్మిది రోజులపాటు పెళ్లికాని యువతులు గోధుమ మొక్కలకు నీరు పోస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, గోధుమ గడ్డి ఏపుగా పెరిగితే పంటలు కూడా సమృద్ధిగా పండుతాయని విశ్వసిస్తారని వివరించారు. చివరి రోజున సేవాలాల్ మహారాజ్‌కు భోగ్ కార్యక్రమం నిర్వహించి, మేరమా యాడికి ప్రత్యేక పూజలు చేసి తీజ్ నిమజ్జనం చేపడతామని తెలిపారు.

తీజ్ ఉత్సవాల కార్యక్రమాలు
ఆగస్టు 18: ఘంవ్ గలేరో - గోధుమ గింజల శుద్ధి
ఆగస్టు 19: తీజ్ బోయెరో - గోధుమ గింజల విత్తనం, ఆగస్టు 20: బోరడి తీజ్,
ఆగస్టు 21: గోర్ బంజారా చరిత్ర, మహా యోధులు, సంస్కృతిపై ప్రసంగాలు
ఆగస్టు 22: బంజారా సాంస్కృతిక కార్యక్రమాలు, గీతాలు, నృత్యాలు, జానపద ఆటలు
ఆగస్టు 23: సాంస్కృతిక కార్యక్రమాలు
ఆగస్టు 24: సాంస్కృతిక, జానపద ప్రదర్శనలు
ఆగస్టు 25: ఢమోళి - పూజలు, ప్రసంగాలు
ఆగస్టు 26: ఘణ గోర్ తీజ్ - పూజలు, వ్రతాలు
ఆగస్టు 27: తీజ్ వెంటారా, కడవ పూజ, సేవాలాల్ భోగ్, మేరమా యాడి పూజ, తీజ్ నిమజ్జనం. ఈ సమావేశంలో రాష్ట్రీయ గోర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు సబావట్ మహేందర్ నాయక్, భూక్య రవి నాయక్, చంద్రు తండా సర్పంచ్ విజయ్ నాయక్, దేవేందర్ నాయక్, వెంకన్న నాయక్, శ్రీధర్ నాయక్, నాగమణి బాయి, సోనా బాయి, అనూష బాయి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా చల్లా శివయ్య సేవలు



**వనపర్తి,జూలై21(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా విద్యాశాఖలో 37 సంవత్సరాల పాటు సేవలందించి ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన చల్లా శివయ్యను మంగళవారం వనపర్తి పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపికతో ఆయనను సత్కరించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా వేలాది మంది విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంతో పాటు, ప్రధానోపాధ్యాయుడిగా పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. 37 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ జీవితంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు సైతం మార్గదర్శకుడిగా నిలిచి, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. ఆయన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పానగల్లు ఎంఈఓ ఆనంద్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బౌద్ధ రెడ్డి, సాహితీ కళా వేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, గంధం నాగరాజు, డా. బి. శ్యాంసుందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- **ధర్మసాగర్‌లో బీఎల్‌వోల అత్యవసర సమావేశం**



**ధర్మసాగర్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా ఆధ్వర్యంలో బీఎల్‌వోల అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియలో తక్కువ శాతం నమోదు చేసిన బీఎల్‌వోలు ప్రత్యేక దృష్టి సారించి శాతం పెంచాలని సూచించారు. ప్రతి ఓటు అమూల్యమైనదని, అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఎంపీడీవో, డిప్యూటీ తహశీల్దార్ మాట్లాడుతూ, మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూర్తి చేయాలనే విషయంపై బీఎల్‌వోలకు సూచనలు, సలహాలు అందించారు. మరో రెండు రోజుల్లోగా నమోదు ప్రక్రియను 95 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎపంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ అధికారి, ఇతర అధికారులు, వార్డు సభ్యులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.







# ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్ బుక్‌లెట్ ఆవిష్కరణ

- **రైతులకు సబ్సిడీపై కంది, పెసర విత్తనాల పంపిణీ**

**హనుమకొండ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** 2026 వానాకాల పంటల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ రూపొందించిన 'ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్-2026' బుక్‌లెట్‌తో పాటు పంటల క్యాలెండర్లను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆవిష్కరించారు.అనంతరం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించేందుకు సబ్సిడీపై అందుబాటులోకి తీసుకువచ్చిన కంది, పెసర విత్తనాల ప్యాకెట్లను హసన్‌పర్తి, ఎల్కతుర్తి, దామెర, భీమదేవరపల్లి మండలాలకు చెందిన రైతులకు మంత్రుల చేతుల మీదుగా వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని, వ్యవసాయ శాఖ సూచనలను రైతులు పాటించాలని ఈ సందర్భంగా మంత్రులు సూచించారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలి

- **విద్యార్థులపై లాఠీచార్జీలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం**
- **డీసీసీ అధికార ప్రతినిధి డా. నరేందర్ పవార్**



**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పేపర్ లీకేజీతో దేశ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ తెలంగాణ ఉద్యమకారుడు డా. నరేందర్ పవార్ డిమాండ్ చేశారు.

నీట్ పేపర్ లీకేజీపై సమాధానాలు కోరిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం కాకుండా, వారి ఆందోళనలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దేశ యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా యువతలో పెరుగుతున్న అసంతృప్తిని తక్కువ అంచనా వేయొద్దని హెచ్చరించిన ఆయన, రాజ్యాంగ విలువలు, విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో యువత శాంతియుత పోరాటానికి సిద్ధంగా ఉందన్నారు.నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పూర్తి బాధ్యత వహించి పారదర్శక చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని డా. నరేందర్ పవార్ పేర్కొన్నారు.

## ముల్కనూరులో పేకాట శిబిరంపై పోలీసుల దాడి..

- **నలుగురు అరెస్ట్, నగదు-మొబైళ్లు స్వాధీనం**

**భీమదేవరపల్లి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**ముల్కనూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు ముల్కనూర్ పోలీసులు పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించగా, మాడుగుల అలెగ్జాండర్ అక్కడి నుంచి పరారయ్యాడు.
మిగిలిన నలుగురు వ్యక్తులు మాడుగుల ప్రసాద్, మాడుగుల కృష్ణ, గునుకుంట్ల రాజయ్య, మాడుగుల బిషప్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.1,480 నగదు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నలుగురిని ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై జూద నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రహదారి ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- **జిల్లాస్థాయిలో రహదారి భద్రత కమిటీ సమావేశాలు తప్పనిసరి**
- **రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్ వికాస్ రాజ్**

**హనుమకొండ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు.
హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి అదనపు కార్యదర్శి డాక్టర్ ఇలంబర్తి, శాంతిభద్రతలు, రవాణా, రహదారులు-భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు, రవాణా, రహదారులు-భవనాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వరంగల్ పోలీసు కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలని, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని, అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రహదారి భద్రతపై వాహనదారుల్లో అవగాహన పెంపొందించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వరంగల్ పోలీసు కమిషనర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ వరంగల్ రీజియన్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, జాతీయ రహదారుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కిరణ్ కుమార్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, రహదారులు-భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ దేవిక చౌహన్, రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ సురేష్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి జనార్దన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చేరాలు తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **కలెక్టరేట్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు**

**హనుమకొండ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ రామచంద్ర నాయక్, డాక్టర్ మురళి నాయక్, కేఆర్ నాగరాజు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొని నాయిని రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి హామీ పథకం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ కడియం కావ్య

- **వరంగల్ జిల్లాలో ఉపాధి, వేతనాల చెల్లింపుల వివరాలు వెల్లడించిన కేంద్రం**



**న్యూఢిల్లీ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపుల స్థితిగతులపై వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఉపాధి కోరిన కుటుంబాలకు ఎంత మేర పని కల్పించారు, ఒక్కో కుటుంబానికి సగటున ఎన్ని పనిదినాలు లభించాయి, వేతనాల చెల్లింపుల్లో ఏవైనా బకాయిలు ఉన్నాయా అనే అంశాలపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖను వివరణ కోరారు .ఈ ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేశ్ పాస్వాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, వరంగల్ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కోరిన అర్హ కుటుంబాల్లో 99.99 శాతం మందికి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 99.97 శాతం మందికి పని కల్పించారు. ఒక్కో కుటుంబానికి సగటున 2024-25లో 41.12 పనిదినాలు, 2025-26లో 27.89 పనిదినాలు లభించాయి.ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించడంలో వరంగల్ జిల్లా మెరుగైన ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావిస్తూ, వారి హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.వేతనాల చెల్లింపుల విషయంలో వరంగల్ జిల్లాలో ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడం సానుకూల పరిణామమన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా కూలీల ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ కావడం వల్ల పారదర్శకత పెరిగిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉపాధి కల్పన రోజులను మరింత పెంచడంతో పాటు మహిళలు, బలహీన వర్గాల భాగస్వామ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఆస్తుల సృష్టి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన ఎల్కతుర్తి విద్యార్థులు



**ఎల్కతుర్తి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్‌లో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో తమ ప్రతిభను చాటుతూ మరోసారి ఘన విజయం సాధించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ప్రతిష్ఠాత్మక నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ బండారి సంపత్ తెలిపారు.
విద్యార్థుల ఈ విజయాన్ని పురస్కరించుకొని పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విజేతలకు షీల్డ్‌లు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయం సాధ్యమైందని ప్రిన్సిపల్ బండారి సంపత్ పేర్కొన్నారు.
ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం విజేతలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.
ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డీజీఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, అకాడమిక్ డీన్ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

## ప్రతిభకు ప్రోత్సాహం.. టాపర్ దీప్తికి రూ.25 వేల నగదు బహుమతి



**వనపర్తి,జూలై21(తెలంగాణ ముచ్చట్లు):** బాలికల విద్యను ప్రోత్సహించే సంకల్పంతో వీఐపీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో తెలుగు మాధ్యమ విభాగంలో పెద్దమందడి మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థిని కుమారి దీప్తికి రూ.25 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు.వనపర్తిలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య చేతుల మీదుగా నగదు బహుమతిని అందించి విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరుస్తున్న బాలికలను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందుతుందని వక్తలు పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దీప్తి సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు.కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు, విద్యార్థిని తల్లిదండ్రులు పాలెం రవి, మహాలక్ష్మి, వీఐపీ సంస్థ ప్రతినిధి నాగేంద్రస్వామి, ప్రజా దర్బార్ విలేఖరి వెంకట్ గౌడ్, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై కేంద్ర మంత్రిని రాజీనామా చేయించాలి

- **విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనే: సీపీఎం**




**సత్తుపల్లి, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర్ ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. పార్లమెంట్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించిన విద్యార్థులపై లాఠీచార్జి, భాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని మండిపడింది. ఈ మేరకు మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షలో ప్రశ్నపత్రాల లీకేజీ అత్యంత తీవ్రమైన ఘటనగా అభివర్ణించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయమైన డిమాండ్లతో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి, భాష్పవాయువు ప్రయోగించడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. ఈ సందర్భంగా నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, లాఠీచార్జికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, దేశంలో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, ఎస్కే వలి, భాస్కర్, సైదా, జిలాని, వెంకటేశ్వరరావు, మీరాజ్, రామకృష్ణ, నబి, ఎస్ఎఫ్ఐ నాయకులు భాను, బాలాజీ, రఫీ, బాబు, జగన్, నాగరాజు, అజిత్, శేషు, పుల్లయ్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు శుభవార్త.. డిగ్రీ కళాశాలలో ఉద్యోగావకాశం

- **జూలై 24 వరకు దరఖాస్తుల స్వీకరణ.. 27న డెమో, ఇంటర్వ్యూలు**



**హుజూరాబాద్, జూలై 21(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. కళాశాలలో ఖాళీగా ఉన్న నాలుగు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాదేవి తెలిపారు.
ఆసక్తి గల అభ్యర్థులు జూలై 24 సాయంత్రం 4 గంటలలోపు తమ దరఖాస్తులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. అనంతరం జూలై 27 ఉదయం 11 గంటలకు డెమో తరగతులు, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.
అభ్యర్థులు సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, ఇతర అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఎన్ ఈ టీ , ఎస్ ఈ టీ , పీ హెచ్ డి అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఉన్నత విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది. గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.


## 12 ఏళ్ల నాటి తెలంగాణ ఉద్యమ కేసు విచారణ..కోర్టుకు హాజరైన జోరిక రమేష్



**హనుమకొండ,జులై21(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన 12 సంవత్సరాల నాటి కేసు విచారణ మంగళవారం హనుమకొండ జిల్లా 3వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో జరిగింది. ఈ కేసులో నిందితులైన తెలంగాణ ఉద్యమకారులు, గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్,
బిఆర్ఎస్ నాయకుడు జోరిక రమేష్, చాగంటి రమేష్ న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు.ఈ కేసు 2014 జూన్ 1న, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఒక రోజు ముందు హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ధ్వంసం ఘటనకు సంబంధించినది. ఈ ఘటనపై సుబేదారి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు కాగా, ప్రస్తుతం సీసీ నంబర్ 3814/2022గా విచారణ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన విచారణలో సాక్షులను ఇరుపక్షాల న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.
విచారణ అనంతరం కోర్టు ఆవరణలో జోరిక రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ కేసులను ఎత్తివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యమ కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యమ కేసులను వెంటనే ఉపసంహరించుకునేలా రాష్ట్ర హోంశాఖ ప్రధాన కార్యదర్శి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల చిత్తశుద్ధితో ఉంటే, రానున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కేసులో ఉద్యమకారుల తరపున న్యాయవాదులు గుర్రాల వినోద్, కొండయ్య, పుల్ల ప్రవీణ్, ఎం. అంబేద్కర్, వేణు పటేల్, నాగరాజు తదితరులు వాదనలు వినిపిస్తున్నారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఉచిత పోటీ పరీక్షల యాప్

- **నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**
- **వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ్ రెడ్డి ఆధ్వర్యంలో "గిఫ్ట్ ఏ స్మైల్"**
- **నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి**
- **చిల్పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్**



**హనుమకొండ, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని జూలై 22న హనుమకొండలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిల్పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్ తెలిపారు.వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "గిఫ్ట్ ఏ స్మైల్" కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఉచిత మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో జూలై 22న నిర్వహించే ఈ కార్యక్రమానికి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలోతు రమేష్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఓటరు నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కౌన్సిలర్

- **ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచన**

**హుజురాబాద్, జూలై 21(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు పెద్దకాలనీలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత బాబు మంగళవారం పరిశీలించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తూ బీఎల్‌వోలు, బీఎల్‌ఎ లతో మాట్లాడి ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బీఎల్‌వో పాక అరుణ, బీఎల్‌పీ శారద, భాగ్యలక్ష్మిలతో సమావేశమై కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, చేర్పుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో తప్పకుండా నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పనిచేయాలని కోరారు.

ప్రజలు కూడా ఓటరు జాబితాను పరిశీలించి, అర్హత ఉన్నప్పటికీ పేరు నమోదు కాకపోతే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కౌన్సిలర్ సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా సర్వే నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# భద్రమైన కరెన్సీకి బలమైన అడుగు

(సి.హెచ్. ప్రతాప్)




భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) రూ.10, రూ.20 నోట్లను ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ (పాలిమర్) కరెన్సీ రూపంలో ప్రవేశపెట్టేందుకు తీసుకున్న నిర్ణయం స్వాగతించదగిన పరిణామం. దేశ ఆర్థిక వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచడంతో పాటు కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించే దిశగా ఇది కీలక సంస్కరణగా నిలిచే అవకాశముంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ద్రవ్య నిర్వహణలో సమర్థంగా వినియోగించాలనే ఆర్‌బీఐ దూరదృష్టికి ఈ చర్య నిదర్శనం.

ప్రస్తుతం భారతదేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లు ప్రత్యేకమైన పత్తి ఆధారిత కాగితంతో తయారవుతున్నాయి. రోజువారీ లావాదేవీల్లో అధికంగా వినియోగించే చిన్న విలువ గల నోట్లు స్వల్పకాలంలోనే మురికిగా మారడం, చిరిగిపోవడం సహజం. వాటిని తరచూ ఉపసంహరించి కొత్త నోట్లు ముద్రించాల్సి రావడం వల్ల ప్రభుత్వంపై గణనీయమైన ఆర్థిక భారం పడుతోంది. కరెన్సీ చలామణి నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యయం మరింత అధికమయ్యే అవకాశముంది. చేతులు మారుతూ నిరంతరం వినియోగంలో ఉండే నోట్లు పరిశుభ్రత పరంగానూ సవాళ్లను సృష్టిస్తున్నాయి.

పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే అత్యంత మన్నికగా ఉంటాయి. నీరు, దుమ్ము, తేమ ప్రభావాన్ని సులభంగా తట్టుకుంటాయి. చిరిగిపోవడం, మడతల వల్ల దెబ్బతినడం కూడా గణనీయంగా తగ్గుతుంది. దీంతో వాటి వినియోగ కాలం సాధారణ నోట్ల కంటే అనేక రెట్లు పెరుగుతుంది. ప్రారంభంలో తయారీ వ్యయం కొంత ఎక్కువగా కనిపించినప్పటికీ, దీర్ఘకాలంలో ముద్రణ, భర్తీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పాత నోట్లను తరచూ మార్చాల్సిన అవసరం తగ్గడం వల్ల సహజ వనరుల వినియోగం కూడా కొంత మేర ఆదా అయ్యే అవకాశముంది.

మరో ప్రధాన ప్రయోజనం భద్రత. పాలిమర్ నోట్లలో అత్యాధునిక భద్రతా లక్షణాలు, ప్రత్యేక సిరాలు, పారదర్శక విండోలు, సూక్ష్మ ముద్రణ వంటి సాంకేతికతలను సమర్థంగా అమర్చవచ్చు. దీంతో నకిలీ నోట్ల తయారీని మరింత సమర్థవంతంగా అరికట్టే అవకాశం ఉంటుంది. దేశ ఆర్థిక భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కరెన్సీపై ప్రజల విశ్వాసాన్ని మరింత దృఢపరచడంలోనూ ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే పాలిమర్ కరెన్సీని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. వారి అనుభవాలు ఈ విధానం ఆచరణ సాధ్యమే కాకుండా ప్రయోజనకరమని నిరూపించాయి. గతంలో ఎదురైన సాంకేతిక పరిమితులను అధిగమిస్తూ, ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి భారతదేశం కూడా ఈ మార్పును వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రయోగాత్మకంగా ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని శాస్త్రీయంగా సమీక్షించి, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ దశలవారీగా అధిక విలువ గల నోట్లకు కూడా విస్తరించవచ్చు. అదే సమయంలో బ్యాంకులు, వ్యాపార సంస్థలు, ఏటీఎంలు, నగదు నిర్వహణ వ్యవస్థలను ఈ మార్పుకు అనుగుణంగా సిద్ధం చేయడం అత్యవసరం.

పరిశుభ్రమైన, మన్నికైన, సురక్షితమైన, వ్యయపరంగా ప్రయోజనకరమైన కరెన్సీ వ్యవస్థ దేశ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుంది. ఆర్‌బీఐ చేపట్టిన ఈ ముందుచూపు నిర్ణయం విజయవంతమైతే, భారతీయ కరెన్సీ నిర్వహణలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికినట్లే. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఆధునిక ద్రవ్య వ్యవస్థ నిర్మాణంలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందనే ఆశించవచ్చు.

# ఎల్ నినోకు సర్కార్ సన్నద్ధం

- **ముందస్తు కార్యాచరణపై వివరించిన భట్టి విక్రమార్క**
- **అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి మహమ్మద్ అజారుద్దీన్**
- **వ్యవసాయం, విద్యుత్, తాగునీటి రంగాలపై ప్రత్యేక దృష్టి**



**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఎల్ నినో ప్రభావం తెలంగాణపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల నుంచి తెలంగాణ సంసిద్ధత వరకు" అంశంపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంపై కేవలం ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవడం మాత్రమే కాకుండా గ్రామీణ స్థాయి వరకు ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వేల కిలోమీటర్ల దూరంలోని పసిఫిక్ మహాసముద్రంలో జరిగే ఉష్ణోగ్రతల మార్పులు తెలంగాణలోని వర్షపాతం, చెరువులు, వాగులు, వ్యవసాయంపై చూపే ప్రభావాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత, కుటుంబ, గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రజలు సంసిద్ధంగా ఉండేలా చైతన్యం తీసుకురావాలని అధికారులకు సూచించారు.

వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా రైతులు నష్టపోకుండా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. తాగునీరు, సాగునీరు, పశువులు, పక్షులు, అటవీ జీవుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా వాతావరణ మార్పులపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. విద్యుత్ వినియోగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన విద్యుత్ నిర్వహణ విధానాన్ని అమలు చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. పగటి సమయంలో లభించే సౌర విద్యుత్‌ను గరిష్ఠంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వంపై, ప్రజలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నామని చెప్పారు. అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్‌ను సమర్థంగా వినియోగిస్తూ విద్యుత్ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామని వివరించారు.

ఎల్ నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవి తరహాలో విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఫ్యాన్లు, శీతలీకరణ పరికరాలు, బోర్‌వెల్లు, ఎత్తిపోతల మోటార్ల వినియోగం పెరగడంతో విద్యుత్ అవసరం గణనీయంగా అధికమైందన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన విద్యుత్ ప్రణాళికలను సిద్ధం చేయడంలో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతో అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. భవిష్యత్తులో జిల్లాల వారీగా కూడా ఈ కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, పలువురు ఐఏఎస్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

- **కోర్టు ధిక్కరణపై రంగనాథ్‌ను నిలదీసిన ధర్మాసనం**
- **కోర్టు ఉత్తర్వుల అమలుపై తీవ్ర వ్యాఖ్యలు**
- **ప్రైవేటు భూముల్లో జోక్యంపై ప్రశ్నల వర్షం**





**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు మంగళవారం తెలంగాణ హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. హైకోర్టుకు చేరుకున్న ఆయన వీఐపీల కోసం కేటాయించిన గేట్ నంబర్ 6 ద్వారా కాకుండా సాధారణ ప్రజలు ఉపయోగించే గేట్ నంబర్ 4 ద్వారా ప్రవేశించాలని భద్రతా సిబ్బంది సూచించారు. దీంతో సాధారణ ప్రజలు వాహనాలు నిలిపే ప్రదేశంలో కారును నిలిపి అక్కడి నుంచి నడుచుకుంటూ కోర్టు ఆవరణలోకి వెళ్లారు. మరోవైపు ప్రైవేటు ఆస్తి వివాదానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడానికి కారణమేమిటని ధర్మాసనం రంగనాథ్‌ను ప్రశ్నించింది.

ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా వ్యవహరించడం ఎందుకని హైకోర్టు నిలదీసింది. కోర్టు ధిక్కరణ అలవాటుగా మారిందా, న్యాయస్థానం ఉత్తర్వులను ఉల్లంఘించడం పరిపాటిగా చేసుకున్నారా అంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఒకే వ్యవహారంపై వరుసగా ధిక్కరణ పిటిషన్లు రావడం కోర్టు ఉత్తర్వుల పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని అభిప్రాయపడింది. ఈ కేసులో బాధితుడు కేవలం పిటిషనర్ మాత్రమే కాదని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం ద్వారా స్వయంగా న్యాయస్థానమే బాధితురాలిగా మారిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. న్యాయవ్యవస్థ పట్ల గౌరవం ఉంటే కోర్టు ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వాధికారిపై ఉంటుందని స్పష్టం చేసింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వ అధికారులు అయినా చట్టానికి అతీతులు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పక్కన బెట్టి ప్రైవేటు భూముల్లోకి ప్రవేశించడం ఏ చట్టం ప్రకారం సమర్థనీయమో వివరించాలని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలోకి వెళ్లకూడదన్న ప్రాథమిక న్యాయసూత్రం తెలియదా అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వ భూములను రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు నమోదు చేశారని కూడా హైకోర్టు ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించే చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేసిన ధర్మాసనం, కేసు తదుపరి విచారణను వాయిదా వేస్తూ సంబంధిత అంశాలపై పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

# ఆయిల్ పామ్ సాగు విస్తరించాలి

- **ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే పంటల మార్పిడి అవసరమని మంత్రి తుమ్మల**
- **ములకలపల్లిలో ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనం**
- **గోదావరి జలాల వినియోగం, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు దిశానిర్దేశం**



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే సంప్రదాయ పంటలతో పాటు పంటల మార్పిడికి రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆయిల్ పామ్ సాగు రైతుల ఆర్థిక స్థిరత్వానికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో నిర్వహించిన ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పాల్గొన్న మంత్రి, రైతులకు పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ, గిరిజన అభివృద్ధి, గోదావరి జలాల వినియోగంపై పలు సూచనలు చేశారు. జిల్లాలో ఈసారి సుమారు 35 శాతం వర్షపాతం లోటు నమోదైన నేపథ్యంలో బోర్లపై ఆధారపడి వరి సాగు చేయడం రైతులకు నష్టదాయకమవుతుందని మంత్రి పేర్కొన్నారు. దీనికి బదులుగా పెసర, మినుము, కంది, అలసంద, మునగ, ఆయిల్ పామ్ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం ములకలపల్లి మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, దీన్ని మరో పది వేల ఎకరాలకు విస్తరిస్తే జిల్లాలో పామాయిల్ కర్మాగారం ఏర్పాటు చేసే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. fసాగునీటి వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 90 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, ఈ ఏడాది మరో 15 వేల ఎకరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. వరికి బదులుగా మొక్కజొన్న, మిర్చి, కూరగాయలు, పప్పుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి పంటలను ప్రోత్సహిస్తూ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. అనంతరం ఆత్మనిర్భర్ మిషన్ అపరాల కార్యక్రమంలో భాగంగా రైతులకు 50 శాతం రాయితీపై కంది, మినుము విత్తనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ పంపిణీ చేశారు. ప్రభుత్వ కల్పిస్తున్న ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుతో ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యం

- **ఉద్యమకారుల కమిటీకి నివేదిక అందజేసిన కల్వకుంట్ల కవిత**
- **కాలయాపన చేయకుండా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి**
- **గుర్తింపు, సంక్షేమంపై సమగ్ర సూచనలు**



**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సమగ్ర నివేదికను అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులతో సమావేశమై ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమం, వారికి అందించాల్సిన ప్రయోజనాలపై పలు కీలక సూచనలు చేశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవించేందుకు కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతించిన ఆమె, ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఎలాంటి ఆలస్యం చేయవద్దని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమ పథకం, హైదరాబాద్ విమోచన ఉద్యమానికి సంబంధించిన నిబంధనలను కమిటీ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కవిత సూచించారు. ఆ విధానాల్లో ఉన్న నిబంధనలను పరిశీలించి తెలంగాణ ఉద్యమకారులకు కూడా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యమానికి సంబంధించిన భావోద్వేగ అంశాలను చట్టబద్ధమైన విధానాలుగా మార్చే బాధ్యత కమిటీపై ఉందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యమకారులకు అమలవుతున్న సంక్షేమ పథకాలను కూడా పరిశీలించాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమంలో తాను ఉద్యమకారులతో భుజం భుజం కలిపి పోరాటం చేసిన వ్యక్తినని కవిత తెలిపారు. ఉద్యమకారుల కోసం అంతర్గత వేదికల్లో నిరంతరం పోరాడిన కారణంగా తాను రాజకీయంగా నష్టపోయానని పేర్కొన్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంతైనా మేలు జరిగితే అదే తన జీవితానికి సార్థకతగా భావిస్తానని అన్నారు. తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు ముందుగా నమస్కరిస్తున్నానని చెప్పారు. ఉద్యమ సమయంలో జైలు శిక్ష అనుభవించిన వారు, ఎఫ్‌ఐఆర్‌లు, అభియోగపత్రాలు నమోదైన వారు, లాఠీ చార్జీలకు గురైన వారు, పోలీసు వేధింపులు ఎదుర్కొన్న వారు, ఆస్తి నష్టపోయిన వారు, ఉద్యోగాలు కోల్పోయిన ఉద్యమకారులను ప్రాధాన్యంతో గుర్తించాలని కవిత కోరారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ ఉద్యమకారులకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించాలని, ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వేలాది మంది ఉద్యమకారుల వివరాలు తమ వద్ద ఉన్నాయని, కమిటీ కోరితే పూర్తి జాబితాతో పాటు అవసరమైన వివరాలను అందజేస్తామని కవిత తెలిపారు. ఉద్యమకారుల సంఖ్య ఎక్కువగా ఉందనే కారణంతో ఎవరికీ అన్యాయం చేయకూడదని, విశాల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. జార్ఖండ్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉద్యమకారుల సంక్షేమ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు ఆలస్యంగా జరిగిందని కవిత విమర్శించారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, ఆ భావనను ఈ కమిటీ తప్పని నిరూపించాలని అన్నారు. నిర్ణీత గడువులోగా ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని కమిటీని కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# వేలాది మందికి చేరుతున్న సోనియా కొండూరి ఆరోగ్య చిట్కాలు !



- సోషల్ మీడియా వేదికగా వంటింటి నుంచి ఆరోగ్యకరమైన సందేశం
- సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సోనియా కొండూరి
- ఆరోగ్యం, పరిశుభ్రత, సహజ జీవనశైలిపై అవగాహన కల్పిస్తున్న కంటెంట్ సృష్టికర్త
- సోనియాను అభినందించిన ప్రముఖ డాక్టర్ విక్రాంత్

**హన్మకొండ,జులై21(తెలంగాణ ముచ్చట్లు):** సోషల్ మీడియా కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని చేరవేసే శక్తివంతమైన వేదికగా మారుతోంది. ఆ వేదికను ప్రజల మేలు కోసం వినియోగించుకుంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న వారిలో హన్మకొండకు చెందిన సోనియా కొండూరి ఒకరు. వంటింటి నుంచి ప్రారంభమైన ఆమె ప్రయాణం నేడు వేలాది మంది కుటుంబాలకు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించే స్థాయికి చేరుకుంది.

రోజువారీ జీవితంలో ప్రతి కుటుంబానికి ఉపయోగపడే అంశాలను ఎంచుకుని సులభమైన భాషలో వీడియోలు రూపొందించడం సోనియా ప్రత్యేకత. వంటింటి పరిశుభ్రత, ఇంటి నిర్వహణ, ఆహార భద్రత, పోషకాహారం, సహజ ఆహార పదార్థాల వినియోగం, కాలానుగుణంగా తీసుకోవాల్సిన ఆహారం, పండ్లు, ఆకు కూరల ప్రయోజనాలు, ఇంటి చిట్కాలు, వంటలో అనుసరించాల్సిన పరిశుభ్రత వంటి అనేక అంశాలపై ఆమె రూపొందిస్తున్న వీడియోలు మంచి ఆదరణ పొందుతున్నాయి.

అంతేకాకుండా వంటగదిలో ఉపయోగించే పాత్రల నిర్వహణ, గృహోపకరణాల శుభ్రత, నిల్వ విధానాలు, ఇంటి పరిశుభ్రతకు సంబంధించిన సూచనలను కూడా ఆమె వీడియోల ద్వారా అందిస్తున్నారు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న మార్పులతో ఆరోగ్యకరమైన జీవనశైలిని ఎలా అలవాటు చేసుకోవచ్చో ఆమె సులభంగా వివరించే విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.


సహజమైన ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఆమె రూపొందించే వీడియోలకు సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభిస్తోంది. కొన్ని వీడియోలు లక్షల్లో, మరికొన్ని వేల సంఖ్యలో వీక్షణలు సాధిస్తూ విస్తృత ఆదరణ పొందుతున్నాయి. గృహిణులు, యువత, కుటుంబ సభ్యులు ఆమె వీడియోలను ఆసక్తిగా వీక్షిస్తూ వాటిలోని సూచనలను ఆచరణలో పెడుతున్నట్లు అనుచరులు అభిప్రాయపడుతున్నారు.

ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం పెంచే ప్రయత్నాలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ విక్రాంత్ ప్రశంసలు తెలియజేయడం ఆమె కృషికి మరో గుర్తింపుగా నిలిచింది.



ఆమె సామాజిక మాధ్యమ ఖాతాను అనుసరించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించాలనే ఆమె ప్రయత్నానికి మరింత ప్రాధాన్యం లభించింది.

నేటి డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రజల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, సానుకూల జీవనశైలిపై అవగాహన కల్పిస్తున్న సోనియా కొండూరి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వినోదంతో పాటు ఉపయోగకరమైన సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో ఆమె చేస్తున్న ప్రయాణం మరింత మందికి ఆదర్శంగా మారుతూ, సమాజానికి ఉపయోగపడే సందేశాలను నిరంతరం చేరవేస్తోంది.









# బల్కంపేట ఎల్లమ్మకు పట్టువస్త్రాలు

- కళ్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- గీతా రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు
- రాష్ట్ర శ్రేయస్సు కోసం అమ్మవారికి ప్రార్థనలు

**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డితో కలిసి కళ్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌కు దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, శివసత్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజల ఫలితంగా దైవానుగ్రహంతో తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా మారి రైతాంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ అన్నిరంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రార్థించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై కేటీఆర్ ధ్వజం

- యువత, రైతులను మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారని వ్యాఖ్యలు
- కాళేశ్వరం, రైతు సంక్షేమం, ఉద్యోగ హామీలపై కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- లక్షెట్టిపేట రైతు సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసంగం

**మంచిర్యాల, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం యువత, రైతులు, మహిళలు సహా అన్ని వర్గాలను మోసం చేసిందని, ప్రజల ఆగ్రహం రోజురోజుకూ పెరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ, దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువత చేపట్టిన ఉద్యమాల తరహాలోనే త్వరలో తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడతాయని అన్నారు. నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు, యువత డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం మాదిరిగానే యువత మరోసారి తిరగబడే పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వమే సృష్టిస్తోందని వ్యాఖ్యానించారు. యువత ఆకాంక్షలను తుంగలో తొక్కి నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీసే రోజు ఎంతో దూరంలో లేదని కేటీఆర్ అన్నారు. ఇటీవల నిర్వహించిన యువ సంగ్రామ సదస్సులో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై యువతలో తీవ్ర ఆగ్రహం ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని ప్రభుత్వం పాలన కొనసాగించే నైతిక హక్కు కోల్పోయిందని ఆరోపించారు. ప్రజల సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన ప్రభుత్వం విమర్శలకు మాత్రమే పరిమితమైందని, ప్రతి ప్రశ్నకు ఎదురుదాడి చేయడం తప్ప ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.

రైతు డిక్లరేషన్ పేరుతో 34 హామీలు ఇచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కరువు ప్రకృతి కారణంగా కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన పరిస్థితేనని విమర్శించారు. పంటల కొనుగోళ్లలో జరిగిన నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల వద్ద నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం కనీస స్పందన చూపలేదని అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోవడంతో బీఆర్ఎస్ ఎనిమిది గంటల పాటు ధర్నా నిర్వహించిందని, అనంతరం కేసీఆర్ ఆదేశాల మేరకు మరణించిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పార్టీ తరపున అందజేశామని తెలిపారు. రైతు బీమా పథకం ద్వారా కూడా మరో రూ.5 లక్షలు అందాయని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర రైతాంగానికి శాశ్వత సాగునీటి పరిష్కారమని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో దానిని వినియోగించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. గోదావరిలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ వాటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టకుండా నీటిని సముద్రంలోకి వదిలేస్తోందని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని, అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను సమన్వయంతో నిర్వహిస్తే ఎల్లంపల్లికి నీటిని తరలించవచ్చని తెలిపారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగి మూడు సంవత్సరాలు గడిచినా మరమ్మతులు చేపట్టకపోవడం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని ఆరోపించారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని నిపుణులు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.

యూరియా పంపిణీని యాప్‌కు పరిమితం చేసి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు నాలుగు విడతల నిధులను కూడా విడుదల చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ అసంతృప్తే రానున్న రోజుల్లో రాజకీయ మార్పుకు కారణమవుతుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, నిరుద్యోగులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తేనే రైతులకు, యువతకు, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, మిగిలిన కాలంలో కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. మంచిర్యాల జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను వేధించే వారి వివరాలను నమోదు చేసుకోవాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు రాజకీయ పార్టీల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలని, ప్రజలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జోగు రామన్న, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు నడిపల్లి దివాకర్ రావు, బాల్క సుమన్, కోరుకంటి చందర్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసు శాఖలో కీలక సంస్కరణలు

- శాఖ భవిష్యత్ కార్యాచరణపై డీజీపీ సమీక్ష
- భద్రత, సాంకేతికత, ట్రాఫిక్ వ్యవస్థ బలోపేతంపై చర్చ
- పలు విధానాల రూపకల్పనకు అధికారుల సూచనల సేకరణ




**హైదరాబాద్, జూలై 21 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ పోలీసు శాఖలో చేపట్టనున్న పరిపాలనా, భద్రతా, సాంకేతిక సంస్కరణలపై డీజీపీ సి.వి. ఆనంద్ ఉన్నతాధికారులతో మంగళవారం సిబ్బంది అధికారుల సమావేశం నిర్వహించారు. శాఖ ఎదుర్కొంటున్న కీలక అంశాలు, భవిష్యత్ కార్యాచరణ, కొత్త విధానాల రూపకల్పనపై విస్తృతంగా చర్చించి అధికారుల అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో భద్రతా సమీక్ష కమిటీ నివేదిక, మావోయిస్టు ముప్పు పేరుతో కొనసాగుతున్న అవసరం లేని భద్రతను ఉపసంహరించడం ద్వారా సుమారు 400 మంది పోలీసు సిబ్బందితో పాటు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను సమర్థవంతంగా వినియోగించే అంశాన్ని సమీక్షించారు. పోలీసు సిబ్బంది, వాహనాల లభ్యతపై సమగ్ర తనిఖీ నిర్వహించి వాటి వినియోగానికి అనుసరించాల్సిన విధానంపై కూడా చర్చించారు.

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ప్రత్యేక దళాల కార్యకలాపాలను ఒకే ప్రాంగణం నుంచి నిర్వహించే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ పోలీసు మాన్యువల్‌తో పాటు అనుబంధ పుస్తకాల రూపకల్పనకు తుది మెరుగులు దిద్దే అంశాన్ని కూడా సమీక్షించారు. అలాగే ఐపీఎస్ అధికారుల యూనిఫామ్‌లో ఉన్న పాత విధానాలను సమీక్షించి, క్రాస్ బెల్ట్‌లు, లాఠీల వినియోగం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు అవసరమనే అంశంపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తెలంగాణ ప్రత్యేక పోలీసు సిబ్బంది సమస్యలు, వాటి పరిష్కారంలో ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయం, అప్రమత్తత, ఆహార కల్తీ నియంత్రణ, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేక అమలు విభాగాల ఏర్పాటు, ట్రాఫిక్ మరియు రహదారి భద్రత కోసం ప్రత్యేక బ్యూరో ఏర్పాటు వంటి అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. ఆధునిక సాంకేతిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక, కంప్యూటర్ సేవల విభాగాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదనను అధికారులు పరిశీలించారు. అలాగే నేరాలు, పోలీసు సేవల డిజిటలీకరణలో భాగంగా సీసీటీఎన్ఎస్ 3.0, టీజీకాప్ 3.0, హాక్‌ఐ 3.0 వ్యవస్థల పురోగతిని సమీక్షించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను ప్రజలకు చేరువ చేయడంపై అధికారులు చర్చించారు. ఈ వ్యవస్థల ద్వారా నేరాల దర్యాప్తు, సమాచార సేకరణ, ప్రజా సేవలను మరింత వేగవంతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో అధికారులు చేసిన సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాలకు తుది రూపు ఇవ్వనున్నట్లు డీజీపీ తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన, సాంకేతిక ఆధారిత పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in